

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 20 జనవరి 2024





జిలుగు వెలుగుల నడుమ ధగధగలాడుతున్న అంబేద్కర్ విగ్రహం

ఆరు గంటలు నరకం

- విజయవాడలో భారీగా ట్రాఫిక్ జామ్
- రహదారులను ఆక్రమించి పార్కింగ్
- సీఎంపై వాహనదారుల మండిపాటు
- ఫ్లై ఓవర్లపై నిలిచిన వాహనాలు



కృష్ణలంకలో నిలిచిపోయిన వాహనాలు

"రాత్రి ఎనిమిది గంటల వరకు ట్రాఫిక్ ఒక మాదిరిగా ఉంటుంది. తొమ్మిది గంటల తర్వాత కొంత వరకు రద్దీ తగ్గుతుంది. పది గంటలకు రహదారులపై ట్రాఫిక్ సాధారణంగా ఉంటుంది. ఇది బెజవాడలో నిత్యం కనిపించే పరిస్థితి. శుక్రవారం రాత్రి పది గంటలైనా రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఫ్లైఓవర్లు కిక్కిరిసిపోయాయి. పోలీసులు అమలు చేసిన ఆంక్షలు వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులను తెచ్చిపెట్టాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులు తప్పలేదు. జాతీయ రహదారులతోపాటు నగర రహదారులపైనా ఇదే సీన్ కనిపించింది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి మొత్తం 2వేల బస్సులు విజయవాడకు చేరుకున్నాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ సభకు ఆయా జిల్లాల నుంచి జానాన్ని తీసుకొచ్చాయి. మొత్తం నాలుగు గంటలపాటు విజయవాడ వాసులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. విధుల నుంచి ఇళ్లకు వెళ్లేవారు, వ్యాపారులు, కూలీలు అందరికీ ట్రాఫిక్ నరకం చూపించింది.

అన్ని రహదారుల్లోనూ ఇదే పరిస్థితి

నగరంలో ఉన్న ట్రాఫిక్‌కు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాఫిక్ తోడవ్వడంతో రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. రామవరప్పాడు నుంచి స్క్రూబ్రిడ్జి వరకు రహదారి వాహనాలతో నిండిపోయింది. రోడ్డంతా కిక్కిరిసిపోయింది. బెంజ్‌సర్కిల్ రెండు ఫ్లైఓవర్ల పైనా ట్రాఫిక్ ఆగిపోయింది. విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే వారిధిపైనా ఇదే పరిస్థితి ఉంది. ఏలూరు రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలూ లేకపోయినా వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఇక్కడ చుట్టుగుంట నుంచి పడవలరేవు వంతెన జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులా బస్సులను నిలుపుదల చేశారు.

ప్రయాణికులను మధ్యలో వదిలేసిన ఆటోలు

నగరంలో ఉన్న ట్రాఫిక్ రద్దీతో ఆటోవాలాలు కొత్త టెక్నిక్‌లు అమలు చేశారు. వాహనాల మధ్య ఆటోలు ఇరుక్కుపోవడంతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చలేదు. మార్గమధ్యలోనే ప్రయాణికులను దింపేశారు. ఈ తరహా ఘటనలు ఏలూరు రోడ్డు, బెంజ్‌సర్కిల్, పీసీఆర్ జంక్షన్లలో కనిపించాయి. చేసేదేమీ లేక ప్రయాణికులు ఇతర వాహనదారులను లిఫ్ట్ అడిగి వెళ్లాల్సి వచ్చింది. మొత్తంగా సీఎం జగన్ పర్యటన విజయవాడ వాసులకు చుక్కలు చూపించింది.

బందరు రోడ్డు బ్లాక్

అంబేద్కర్ స్మృతివనరం ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా తరలించిన జనాల కారణంగా వారిని తీసుకువెళ్లడానికి బస్సులు రావటంతో.. దిగ్బంధమైపోయింది. బందరు రోడ్డు మీద వాహనాలను అనుమతించకపోవటంతో.. నగర ప్రజలు రాకపోకలు సాగించటానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతర్గత రోడ్లలో ముందుకు కదలటానికి గంటల సమయం పట్టింది. బహిరంగ సభ, విగ్రహావిష్కరణల అనంతరం కూడా నాలుగు గంటల పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు. బస్సులు ముందుకు కదలటానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



బంటుమిల్లిలో మోకాళ్లపై నిల్చొని అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న అంగన్వాడీలు

• మహనీయుల విగ్రహాలకు వినతులు

మొవ్వలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికీ 39వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా మొవ్వ జేజే నగర్‌లోని బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించి నిరసన తెలిపారు. తొలుత ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న జగన్మోహనరెడ్డికి నమస్కారం అంటూ బంటుమిల్లిలో మోకాళ్లపై నిలబడి అంగన్వాడీ కార్యకర్తలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎక్కడ సామాజిక న్యాయం అంటూ ప్రశ్నిస్తూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు.

- బంటుమిల్లి/కూచిపూడి



మొవ్వలో..

దుర్గమ్మకు భవానీల కానుకలు
రూ.4.08 కోట్లు

- 6లో..

ఉమ్మడి కృష్ణా జిల్లా వైసీపీ రాజకీయాలు హీటెక్కాయి. ఆ పార్టీ నుంచి కీలక నేతలు ఒక్కొక్కరూ దూరమవుతున్నారు. ఇప్పటికే గుడ్‌బై చెప్పిన వారిలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి ఉండగా ఇప్పుడు వారి సరసన తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి కూడా చేశారు. 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు అంటున్న సీఎం జగన్ ఓ దళిత ఎమ్మెల్యేనైన నన్ను నమ్మించి నట్టేట ముంచారు' అంటూ రక్షణనిధి ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క బయటకొచ్చేవారు టీడీపీ, జనసేన వైపు చూస్తున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

వైసీపీతో రక్షణనిధి తెగదెంపులు



వైసీపీ 4వ జాబితాలో రక్షణనిధికి బదులు తిరువూరు టికెట్‌ను ఎంపీ కేశినేని నాని అనుచరుడు స్వామిదాసుకు కేటాయించడంతో శుక్రవారం రక్షణనిధి విలేకరుల ముందుకొచ్చారు. వైసీపీతో తెగదెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. పార్టీ పెద్దలను కలిసే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. టికెట్ ఇస్తానని చివరి వరకు నమ్మించి తన గొంతు కోశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో తాను టీడీపీలో చేరనున్నట్టు పరోక్షంగా సంకేతాలిచ్చారు. 'వచ్చే ఎన్నికల్లో వైసీపీ టిక్కెట్ రానంత మాత్రాన ప్రజలకు దూరం కాలేను' అని అన్న రక్షణనిధి, నియోజకవర్గ ప్రజలు తనను టీడీపీ టికెట్ తెచ్చుకున్నా గెలిపిస్తామని అంటున్నారని తన భవిష్యత్తు రాజకీయ ప్రయాణాన్ని వివరించారు. రక్షణనిధి వ్యాఖ్యలతో ఆయన టీడీపీలో చేరడం దాదాపు ఖాయమని స్పష్టమవుతోంది. పోటీ చేసే సీటుపై స్పష్టత రాగానే ఆయన చేరిక ఉంటుందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ఒక్కొక్కరుగా..

వైసీపీ నుంచి తప్పుకుంటున్న కీలక నేతలు

- తాజాగా రక్షణనిధి గుడ్‌బై
- పార్టీ పెద్దలను కలిసే ప్రసక్తే లేదని స్పష్టం
- టీడీపీ వైపు అడుగులు..
- టికెట్ ఖరారైన వెంటనే ప్రకటన
- జనసేనానిని కలిసిన బాలశౌరి..
- మచిలీపట్నం నుంచే బరిలోకి
- పార్థసారథిని కలిసిన బుద్దా, బొప్పన

• పార్థసారథిని కలిసిన బుద్దా, బొప్పన

పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథిని శుక్రవారం టీడీపీ నేత బుద్దా వెంకన్న, వైసీపీని వీడిన బొప్పన భవకుమార్ కలిశారు. పార్థసారథి నివాసానికి వెళ్లిన వారు ఆయనతో సుమారు గంటసేపు భేటీ అయ్యారు. బీసీల పార్టీ అయిన టీడీపీలో పార్థసారథికి సముచిత స్థానం దక్కుతుందని ఈ సందర్భంగా వెంకన్న వ్యాఖ్యానించారు. సారథి టీడీపీలో చేరిక మరో రెండురోజులు వాయిదా పడింది. టీడీపీ అధినేత చంద్రబాబు అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి వెళుతుండటంతో సారథి 23న పార్టీ తీర్థం పుచ్చుకునే అవకాశాలున్నాయి. నూజివీడు అసెంబ్లీ బరి నుంచి సారథి పోటీ చేయనున్నట్టు సమాచారం.



పార్థసారథితో బుద్దా వెంకన్న, బొప్పన భవకుమార్

• బాలశౌరి మచిలీపట్నం నుంచే..




జనసేన అధినేతతో ఎంపీ బాలశౌరి, ఆయన తనయుడు అనుదీప్

వైసీపీకి గుడ్‌బై చెప్పిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి శుక్రవారం హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిశారు. తన కుమారుడు అనుదీప్‌తో కలిసి ఆయన పవన్ నివాసానికి వెళ్లారు. ప్రముఖ సినీ నటుడు చిరంజీవితో బాలశౌరికి సన్నిహిత సంబంధాలున్నాయి. బాలశౌరి తనయుడు అనుదీప్ పెళ్లికి చిరంజీవి కుటుంబసమేతంగా హాజరయ్యారు. ఈ సాన్నిహిత్యం దృష్ట్యా బాలశౌరి వైసీపీని వీడాలని నిర్ణయించుకున్న తర్వాత జనసేన వైపు మొగ్గుచూపారు. మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి ఆయన జనసేన అభ్యర్థిగా బరిలో నిలవడం దాదాపు ఖాయమైనట్లేనని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన తనయుడిని రాజకీయ అరంగేట్రం చేయించేందుకు బాలశౌరి సిద్ధమవుతున్నారు. ఆయన తనయుడు అనుదీప్‌కు అసెంబ్లీ టికెట్ కోసమూ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి కృష్ణా లేదా గుంటూరు జిల్లాల్లో జనసేనకు కేటాయించే అసెంబ్లీ స్థానాల్లో ఒకదాని నుంచి తన కుమారుడిని బరిలోకి దింపాలన్న యోచనలో బాలశౌరి ఉన్నారు.

బుసకాసురుడు!

గిలకలదిండిలో వైసీపీ ప్రజాప్రతినిధి బుసక దందా

- ప్రభుత్వ భూమిలో బుసక తవ్వకం
- జగనన్న లే అవుట్‌లకు మెరక పేరుతో అక్రమం
- ప్రయివేటు వ్యక్తులకు విక్రయం
- దూరాన్ని బట్టి ట్రక్కు రూ.800-రూ.1500కు అమ్మకం
- రోజుకు 300 ట్రక్కుల బుసక తరలింపు
- కన్నెత్తిచూడని అధికారులు



ఆయన అధికార పార్టీ ప్రజాప్రతినిధి. ఏం చేసినా తనకు ఎదురేలేదని భావించాడు. అడ్డగోలు అక్రమాలకు తెగబడ్డాడు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డదిడ్డంగా బుసక దోపిడీకి తెరలేపాడు. మచిలీపట్నం శివారున, సముద్రతీరం పక్కనే ఉన్న గిలకలదిండిలో బుసక తవ్వకాలకు తెరదీశాడు. జగనన్న లే అవుట్లలో ఇళ్ల స్థలాల మెరక కోసం అనే పేరుతో బుసక తోడేసి అమ్మేస్తున్నాడు. ఒక్కొక ట్రక్కు రూ.800 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నాడు. సముద్ర తీరంలోని ప్రభుత్వ భూముల నుంచి బుసకను తవ్వి విక్రయాలు జరుపు తున్నా అధికారులు ఆవైపునకు కన్నెత్తి చూడటంలేదు. వారంరోజులకుపైగా బుసక అక్రమ తవ్వకాలు చేస్తూ బయటి ప్రాంతాల్లో విక్రయిస్తూ కాసులు గడిస్తున్నా పట్టించుకోవడం లేదు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గిలకలదిండిలో 18 ఎకరాల భూమిలో జగనన్న లే అవుట్‌ను రూపొందించారు. గతేడాది ఈ లే అవుట్‌లో కొంతమేర భూమిని మెరక చేశారు. ఈ లే అవుట్‌లో 990 మందికిపైగా ఇళ్లస్థలాలు ఇస్తామని పేదలకు ఆశ చూపారు. రెండేళ్ల క్రితమే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చినా ఇంటిస్థలం ఎక్కడ ఉందో నేటికీ చూపలేదు. ఈ ఇళ్ల స్థలాలను మెరకచేసే పేరుతో వారం క్రితం గిలకలదిండిలోని సర్వేనెంబరు 677లోని భూమిలో బుసక తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలోకి ఎక్స్‌కవేటర్‌ను, 20 ట్రాక్టర్లను తీసుకొచ్చి బుసక తవ్వకాలు ప్రారంభించారు. జగనన్న లే అవుట్‌లో మెరక పనులు చేయకుండా, ఆ ముసుగులో బుసకను విక్రయించేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా బుసక తవ్వకాలు చేస్తూ గిలకలదిండి, బందరుకోట, మచిలీపట్నంలోని ఇతర ప్రాంతాలకు బుసకను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

లక్షలాది రూపాయల బుసక విక్రయం

సముద్రతీరం వెంబడి బుసక తవ్వకాలపై నిషేధం ఉంది. ఇక్కడి బుసకలో వివిధ రకాల నిక్షేపాలు ఉండటంతో తీరం వెంబడి ఎలాంటి తవ్వకాలకూ అనుమతులు లేవు. అయినా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి, అతని అనుచరులు యథేచ్ఛగా ఇక్కడి నుంచి బుసక తవ్వకాలు చేస్తున్నారు. బయటి ప్రాంతాలకు దూరాన్ని బట్టి బుసక ధరను నిర్ణయించి ట్రక్కు రూ.800 నుంచి రూ.1500కు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వారం రోజులుగా రోజుకు కనీసంగా 300 ట్రక్కుల బుసకను విక్రయించేస్తున్నాడని, అది కూడా ప్రభుత్వ భూముల్లో బుసకను తవ్వేస్తున్నారని గిలకలదిండివాసులు చెబుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ బుసక తవ్వకాలను నిలిపివేయాలని గిలకలదిండి వాసులు కోరుతున్నారు.

ఆది నుంచీ వివాదాస్పదుడే

గిలకలదిండికి చెందిన అధికార పార్టీ నాయకుడి తీరు ఆది నుంచి వివాదాస్పదమే. గిలకలదిండి లే అవుట్‌లో 950 మదికిపైగా పట్టాలు ఇవ్వగా వాటిలో అధికార పార్టీ నాయకుడు 200లకుపైగా ఇంటి పట్టాలను స్థానికేతరుల నుంచి నగదు తీసుకుని పట్టాలు ఇచ్చారనే విమర్శలున్నాయి. ఈ అంశంపై గిలకలదిండివాసులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిజాలు నిగ్గుతేల్చాలని కోరుతున్నారు. గిలకలదిండిలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే కారణంతో ఇళ్లస్థలాలు ఇవ్వకుండా రెండేళ్లుగా జాప్యం చేయడం గమనించదగ్గ అంశం. వాస్తవంగా ఇళ్లస్థలాలు ఇవ్వాల్సిన వారికి ఇవ్వకుండా, టీడీపీకి అనుకూలంగా ఉన్న వారిని లబ్ధిదారులుగా గుర్తించలేదని స్థానికులు చెబుతున్నారు. ఒక్కో ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నా వారికి ఇళ్లస్థలాలు ఇవ్వకుండా విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లలో ఉండేవారిని ఇళ్లస్థలాల జాబితాల్లో చేర్చారని స్థానికులు విమర్శిస్తున్నారు. గిలకలదిండిలో ఇళ్లస్థలాలకు భూమిని కొనుగోలు చేసే సమయంలోనూ ప్రభుత్వ భూమికి పత్రాలు పుట్టించిన అధికారపార్టీ నాయకుడు లక్షలాది రూపాయలను దిగమింగేశాడనే విమర్శలున్నాయి. వివాదాస్పదమైన గిలకలదిండి జగనన్న లే అవుట్‌లో గతేడాది రూ.3కోట్లతో మెరకపనులు చేసినట్లుగా చూపి బిల్లులు చేయడం గమనించదగ్గ అంశం.

నందిగామ మున్సిపాలిటీ
పీఠం ఎవరిదో!

వరలక్ష్మి మృతితో కొత్తవారికి అవకాశం

- ఓర్సు లక్ష్మి, కృష్ణలలో ఒకరికి చాన్స్

- 6లో..


దురగుడిలో కానుకల లెక్కింపు

దుర్గమ్మకు భవానీల కానుకల లెక్కింపు
రెండు రోజుల్లో రూ.4.08 కోట్లు

వన్‌టౌన్/విజయవాడ, జనవరి 19 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 3నుంచి 7వ తేదీ వరకు జరిగిన భవానీ దీక్షల విరమణకు వచ్చిన భక్తులు కనకదుర్గమ్మకు సమర్పించిన కానుకల లెక్కింపు పూర్తయింది. గురు, శుక్రవారాల్లో కానుకలను లెక్కించారు. రెండురోజుల్లో మొత్తంగా రూ. 4,08,64,534 నగదు లభించింది. బంగారం 358 గ్రాములు, వెండి 26కిలోల 425 గ్రాములు, విదేశీ కరెన్సీలో అమెరికా రూ. 248 డాలర్లు, ఓమన్ 16 రియాన్లు, కతార్ 109 రియాల్స్, ఆస్ట్రేలియా 75 డాలర్ల, సింగపూర్ 2 డాలర్లు యూఏఈ 40 దీర్హమ్స్, కువైట్ 11.25 దీనార్లు, థాయిలాండ్ 140 బట్లు వచ్చాయి. ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

అన్నవితరణకు రూ. 1,00,116 విరాళం

దుర్గగుడిలో అన్నవితరణ కార్యక్రమానికి విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన సీతారాజ్యలక్ష్మి శుక్రవారం రూ. 1,00,116 విరాళం అందజేశారు. ఏఈవో రమేష్ ద్వారా విరాళం అందజేసి అమ్మవారిని దర్శించుకున్నారు.


జేసీకి తడిసి, రంగు మారిన ధాన్యం చూపుతున్న రైతులు

రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి

గురజాడ(పమిడిముక్కల), జనవరి 19 : తుఫాన్ వల్ల తడిసి రంగుమారిన ధాన్యం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసి ఆదుకోవాలని గురజాడ, తాండికి రైతులు జేసీ గీతాంజలి శర్మను కోరారు. గురజాడలో ఇథనాల్ ప్లాంట్ స్థల పరిశీలనకు శుక్రవారం గురజాడ వచ్చిన జేసీని పలువురు రైతులు కలిసి తడిసి రంగుమారిన ధాన్యం చూపించారు. ధాన్యం ఆన్‌లైన్‌లో మిల్లర్లు తీసుకోపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు. ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, మండల తహసీల్దార్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న వైసీపీ నేతలు!

» **టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు : కేశినేని శివనాథ్ (చిన్ని)**



కంచికచర్ల/చందర్లపాడు, జనవరి 19 : నందిగామ నియోజకవర్గంలో వైసీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, అధికారుల పక్షపాతధోరణితో టీడీపీ కార్యకర్తలను కేసుల్లో అక్రమంగా ఇరికిస్తున్నారని కేశినేని శివనాథ్ (చిన్ని) ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచికచర్లలో శుక్రవారం సీనియర్ నేత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ ఇంటి వద్ద పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కనుసన్నల్లో దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, న్యాయం చేయాల్సిన పోలీసులు వారికి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల టీడీపీ మహిళా నేతపై అభ్యంతరకర వీడియోలు ప్రదర్శించిన నిందితుడు కరీంపై కేసు పెడితే పట్టించుకోని పోలీసులు బాధితులపైనే ఎదురు కేసులు పెట్టడం అమానుషమన్నారు. మాజీ ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ, నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కూడా అవహేళనగా మాట్లాడటం దారుణమన్నారు.

వ్యక్తులు కాదు వ్యవస్థ ముఖ్యం.. చిన్ని వెంటే నాని అనుచరులు

పార్టీలో ఉన్నంత వరకే గౌరవిస్తాం.. ప్రాణంగా భావించే పార్టీని, అన్నలా భావించే అధినేతను దూషిస్తే సహిస్తామా.. ఇది నందిగామలో టీడీపీ నేతల మాట. మండలంలోని తుర్లపాడు గ్రామంలో కబడ్డీ పోటీల ప్రారంభానికి హాజరైన చిన్ని, మాజీ ఎమ్మెల్యే సౌమ్యలకు ముప్పాళ్ల గ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. ఇప్పటి వరకూ ఎంపీ కేశినేని వెంట ఉన్న నేతలు సమావేశానికి హాజరై పార్టీ పట్ల, అధినేత పట్ల నిబద్ధతను చాటుకున్నారు. పార్టీ నాయకుడై ఉన్నందునే తాము ఎంపీ కేశినేని వెంట నడిచామని, గీత దాటిన ఆయన్ను అనుసరించాల్సి అవసరం మాకు లేదని సదరు నేతలు స్పష్టం చేశారు. అధినేత ఎవరిని సూచిస్తే వారికి అనుకూలంగా పనిచేస్తామన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాష్ట్రాన్ని కాపాడడమే అందరి లక్ష్యమని చిన్ని అన్నారు. అనంతరం ముప్పాళ్ల నుంచి తుర్లపాడు వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

వైసీపీ వలస వెళ్లే రోజులొచ్చాయి : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్ : అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ నాయకులను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు తట్టా బుట్టా సర్దుకుని వలస పోయే రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడివాడలో జరిగిన 'రా కదలి రా' భారీ బహిరంగ సభకు వచ్చిన అశేష జనాన్ని చూసి వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. గుడివాడ నియోజకవర్గమే కాకుండా అన్ని నియోజకవర్గాల్లో చంద్రబాబు, జనసేన నాయకులకు ప్రజలు పట్టం కడుతున్నారన్నారు.

ఓటమి భయంతోనే పార్టీ వీడుతున్నారు : రవీంద్ర



మచిలీపట్నం టౌన్ : ఓటమి భయంతోనే వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం బందరులో విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పుట్టుకొచ్చిందని, కృష్ణాజిల్లాలో చాలామంది వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారన్నారు. సీఎం జగన్‌రెడ్డికి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కులేదన్నారు. బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌ల మధ్య రాజకీయ విభేదాలు సృష్టించేందుకు కొందరు పని గట్టుకుని ప్రచారం చేయడం సబబుకాదన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి కృష్ణాజిల్లాలోని అన్ని సీట్లు గెలుచుకుంటాయన్నారు.

కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయండి : దేవినేని ఉమా



ఇబ్రహీంపట్నం : ఏపీలో జగన్మోహన్ రెడ్డి సైకో పాలనలో దళితులపై దాడి జరగని రోజు లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా టీడీపీ శ్రేణులు, ఎస్సీ సెల్ నేతలతో కలిసి శుక్రవారం ఉమా కొండపల్లి మున్సిపాలిటీలో అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేశారు. కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని, దళితులపై దమనకాండ ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రేవంత్‌రెడ్డి, సీతక్కలను చూసి నానీలు బుద్ధి తెచ్చుకోవాలి

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కలను చూసి విజయవాడ ఎంపీ కేశినేని నాని, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిలు బుద్ధి తెచ్చుకోవాలని మాజీమంత్రి ఉమా హితవు పలికారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, అంకుశం సినిమాలో రామిరెడ్డికి పట్టిన గతి గుడివాడ సెంటర్లో ప్రజలు ఎమ్మెల్యే నానికి పట్టిస్తారన్నారు. పార్టీ రంగు మారగానే కేశినేని నానికి పోలవరం గుర్తుకు వచ్చిందన్నారు. పట్టిసీమ, పోలవరం గురించి మాట్లాడే అర్హత నానికి లేదన్నారు.

బస్సులన్నీ బహిరంగ సభకే..

» ప్రయాణికులు విలవిల.. సిటీ బస్సుల్లేక తీవ్ర అవస్థలు
» నిర్మానుష్యంగా పీఎన్‌బీఎస్ ఆటోలకు డిమాండ్..
» రెండు రెట్లు అదనంగా ఛార్జీల వసూలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక సమతా సంకల్ప బహిరంగ సభకు జనాల కోసం బస్సులన్నీ తరలించడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి 260 బస్సులు వినియోగించగా నగరంలో సిటీ బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీఎస్‌బీఎస్ వద్ద సిటీ టెర్మినల్‌లో బస్సుల కోసం గంటల తరబడి చూసినా రాకపోవటంతో చేసేదిలేక ఆటోలను ఆశ్రయించారు. ఆటోవాలాలు ప్రయాణికుల నుంచి రెట్టింపు ధర వసూలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2620కి పైగా బస్సులు బహిరంగ సభకు తరలడంతో.. బస్సులు లేక పీఎన్‌బీఎస్ బోసిపోయింది. రైల్వేస్టేషన్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆటోవాలాలు భారీగా రేట్లను పెంచేశారు. ప్రజలు బస్సులు దొరక్క. నానా ఇబ్బందులు పడ్డారు. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలతో ఆటోలు కూడా ఎక్కడికక్కడ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోయాయి. కృష్ణాజిల్లా నుంచి 180 పైగా బస్సులు బహిరంగ సభకు వినియోగించడంతో విజయవాడ, మచిలీపట్నంల మధ్య అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.


విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద


పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..

» ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారా
» అంగన్వాడీల కోసం ప్రత్యక్ష పోరాటానికి దిగుతాం
» మహిళలను ఇన్ని రోజులు రోడ్లపై కూర్చోబెడతారా
» యూనియన్ నేతలతో చర్చించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
» కార్యకర్తల దీక్షా శిబిరంలో పలువురు వక్తల ఉద్ఘాటన


బందరులో నిరాహార దీక్ష


విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళన

ధర్నాచౌక్, జనవరి 19: రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా, లేదా అని పలువురు నేతలు ప్రశ్నించారు. గత 39 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె, మూడు రోజులుగా నిరవధిక నిరహారదీక్ష చేస్తున్న అంగన్వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇన్ని రోజులుగా మహిళలను రోడ్లపై కుర్చో పెట్టడం మంచిది కాదని సీఎం జగన్‌కు హితవు పలికారు. స్థానిక ధర్నాచౌక్‌లో అంగన్వాడీలు చేపట్టిన నిరహారదీక్ష మూడవ రోజు శుక్రవారం కొనసాగింది. ఈ దీక్షను సందర్శించిన పలు కార్మిక, ప్రజా సంఘాల నేతలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక వైపు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ మరోవైపు ప్రజాస్వామిక విలువలకు పాతరేస్తూ అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. సీఎం జగన్‌కు అంబేడ్కర్, దళితుల మీద ప్రేమ లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు అధికంగా అందిస్తామన్న హామీని సీఎం జగన్ తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని లేదంటే తాము కూడా వారి పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగభూషణ, కె.ఉమామహేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర నేతలు సీహెచ్.నర్సింగరావు, యండీ.గఫూర్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు రమాదేవి, ఇప్టూ నేత ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ అఖిల భారత కార్యదర్శి ఎస్. వరలక్ష్మీ తదితరులు ప్రసంగించారు.

దిగిరాకపోతే ఆమరణ దీక్ష

» **శిబిరంలోనే నిద్రించిన కార్యకర్తలు**


శిబిరంలో నిద్ర



మచిలీపట్నం టౌన్ : ప్రభుత్వం దిగిరాకపోతే ఆమరణ దీక్షకు దిగుతామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ రాస్తారోకోలు, కలెక్టరేట్ సహా వివిధ కార్యాలయాలు ముట్టడిస్తామని అంగన్వాడీ కార్యకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తల సమ్మె 39వ రోజుకు చేరుకుంది. రిలే దీక్షల శిబిరంలోనే కార్యకర్తలు నిద్రిస్తున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా నాయకులు ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని, రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి రెజీనారాణి, నాయకురాలు లక్ష్మీ తదితరులు ప్రసంగించారు. అంగన్వాడీ కార్యకర్తల కోర్కెలు న్యాయ సమ్మతమని, ప్రభుత్వం కనీస వేతనం రూ. 26 వేలు పెంచాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

తానా కార్యదర్శిగా కసుకుర్తి రాజా ఎన్నిక



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఉత్తర అమెరికా తెలుగుసంఘం(తానా) కార్యదర్శిగా రాజా కసుకుర్తి ఎన్నికయ్యారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో జన్మించిన కసుకుర్తి రాజా విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నరేన్ కొడాలి ప్యానల్‌లో కసుకుర్తి రాజా కార్యదర్శిగా విజయం సాధించారు. కోశాధికారి, కో-ఆర్డినేటర్‌గా వివిధ పదవులు నిర్వహిస్తూ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు విదేశంలో అవసరమైన సహకారాన్నందించారు. అందరినీ కలుపుకుని తెలుగువారికి మరింత సేవలందించేందుకు కృషి చేస్తానని ఆయన ఫోన్‌లో తెలిపారు. కసుకుర్తి రాజా ఎన్నిక పట్ల ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

టీడీపీ, జనసేన నేతలపై కేసు నమోదు

గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు తులసీబాబు, యక్కలి మణిదీప్, కడియాల గణేష్, జనసేన నాయకులు సందు పవన్‌లతో పాటు మరికొందరు నాయకులపై సెక్షన్ 143, 188, 353 రెడ్‌విత్ 149 కింద కేసులను వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం గుడివాడ మండలం మల్లాయిపాలెంలో జరిగిన చంద్రబాబు 'రా..కదిలిరా' బహిరంగసభకు ర్యాలీగా బయలుదేరిన టీడీపీ, జనసేన నాయకులను పోలీసులు అడ్డుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బారికేడ్లలను తొలగించిన నాయకులపై హెడ్ కానిస్టేబుల్ పళ్లెం కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


గుండె జబ్బులకు ఆధునిక చికిత్సలు

» **21న విజయాస్ రవి హార్ట్‌కేర్ సెంటర్ ప్రారంభం : డాక్టర్లు శరత్‌బాబు, రవికుమార్**


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శరత్‌బాబు, రవికుమార్

పాయకాపురం, జనవరి 19 : గుండెజబ్బు బారిన పడిన మధ్యతరగతి ప్రజలకూ ఆధునిక చికిత్స అందించాలన్న లక్ష్యంతో ఈ నెల 21 నుంచి విజయాస్ రవి హార్ట్‌కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు విజయ సూపర్ స్పెషాలిటీ హస్పటల్ సీఈవో డాక్టర్ జి.శరత్‌బాబు తెలిపారు. శుక్రవారం సూర్యారావుపేటలోని తమ హస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన దశాబ్దకాలం పైగా విజయ హస్పటల్ ద్వారా ఎంతోమందికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించామన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బుల సమస్య విపరీతంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని, అందుకోసం అన్ని వర్గాల వారికి అందుబాటులోకి అత్యున్నత స్థాయి విజయాస్ రవి హార్ట్‌కేర్ సెంటర్‌ను విశిష్ట నిపుణులైన వైద్యులచే ఈ నెల 21న లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్‌నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో అన్నివర్గాల వారికి కరోనరీ యాంజియోగ్రామ్ (గుండె రక్తనాళ పరీక్ష), కరోనరీ యాంజియోప్లాస్టి (స్టెంట్స్ అమర్చడం), పేస్ మేకర్ అమర్చడం, గుండె రంధ్రాలకు ఆధునిక డివైజ్ క్లోజర్ చికిత్స, బైపాస్ సర్జరీలు, వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు, బెలూన్ వాల్వోటమి తదితర ఆధునిక చికిత్సలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. తనతో పాటు బైపాస్ సర్జరీలు చేయడంలో అత్యంత ప్రావీణ్యం గల కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రశాంత్ ప్రభు నేతృత్వం వహిస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత అరుదైన జపాన్‌కు చెందిన షిమాడ్జు కేతలాబ్‌ను, అధునాతనమైన ఆపరేషన్ థియేటర్, కార్డియాక్ ఐసీయూ, పేషెంట్లకు అనుగుణంగా డీలక్స్ రూమ్‌లు వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, సీజీహెచ్‌ఎస్, అన్ని రకాల కంపెనీల రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంటుందన్నారు. మొదటి గంటలో గుండె పోటు సంభవించినప్పుడు వైద్యులను సంప్రదిస్తే 95శాతం పేషెంట్ రికవరీ అయ్యే చాన్స్ ఉందన్నారు. అనంతరం గుండె జబ్బులపై అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో హస్పటల్ చైర్మన్ జి.వెంకట్రావ్, డాక్టర్లు జి.శరత్‌బాబు, జి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నాని మాటపై నిలబడాలి.. : వెనిగండ్ల



గుడివాడ, జనవరి 19 : గుడివాడలో గురువారం జరిగిన 'రా..కదలిరా' బహిరంగ సభకు ఐదువేల మంది కూడా రారని చెప్పిన ఎమ్మెల్యే కొడాలి నాని యిచ్చిన మాటపై నిలబడాలని టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభను విజయవంతం చేసిన టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చేసిన వాగ్దానానికి కట్టుబడి నాని ఊరు ఎప్పుడు వదిలిపోతున్నాడో తెలపాలని, లేదా తామే పంపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నాని, అతని అనుచరుల ద్వారా ఆస్తులు, వ్యాపారాలు నష్టపోయిన వారికి తిరిగి యిప్పిస్తామని హామీ యిచ్చారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో కృష్ణా బోర్డు కార్యాలయం పెట్టండి

» **చంద్రబాబుకు రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సమాఖ్య వినతి**


చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సమాఖ్య నేతలు

గుడివాడ, జనవరి 19 : కృష్ణానది యాజమాన్య బోర్డును విజయవాడలో ఏర్పాటు చేయాలని, కృష్ణాజలాల పునఃపంపిణీ గెజిట్‌తో తెలుగు రాష్ట్రాల రైతుల నీటి హక్కులకు జరిగే అన్యాయాన్ని సరిచేయాలని చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర సాగునీటి వినియోగరుదారుల సమాఖ్య సభ్యులు తెలిపారు. గురువారం మల్లాయిపాలెంలో జరిగిన 'రా..కదలిరా' బహిరంగ సభలో ఈ మేరకు చంద్రబాబుకు విన్నవించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఇబ్రహీంపట్నంలో కె.ఆర్.ఎం.బి కార్యాలయానికి భవనాలను పరిశీలించారని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2019, 2020లో విజయవాడలో కె.ఆర్.ఎం.బి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు పలుమార్లు లేఖలు రాయడం జరిగిందన్నారు. విజయవాడలో కార్యాలయం ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నంలో కె.ఆర్.ఎం.బి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. కృష్ణాబేసిన్‌కు అవతల డెల్టాకు 400కిలోమీటర్లు, ఎస్ఎస్‌పికి 700కిలోమీటర్లు, శ్రీశైలంకు 800కిలోమీటర్లు దూరంలో ఉన్న విశాఖలో కార్యాలయాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కృష్ణాజలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గెజిట్ వలన శ్రీశైలం ఎగువ భాగాన సి.డబ్ల్యూ.సి, ఎపెక్స్ కౌన్సిల్, కె.ఆర్.ఎం.బి నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పైరాష్ట్రాలు కొత్తగా ప్రాజెక్టు నిర్మాణం చేపడితే కృష్ణాడెల్టాతో పాటు నాగార్జునసాగర్ ఎడమ కాలువలు, ఎస్.ఆర్.బి.సి కింద ఉన్న మొత్తం 30లక్షల ఎకరాలకు చుక్క నీరు కూడా అందక బీడుగా మారే ప్రమాదముందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం విడుదల చేసిన గెజిట్‌ను నిలుపుదల చేసి రాష్ట్ర రైతుల నీటి హక్కులను కాపాడాలని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కార్యక్రమంలో తూర్పుకృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి), తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కుర్రా నరేంద్ర, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ గుండపనేని శ్రీనివాసరావు తదితరులున్నారు.

పీఠం ఎవరిదో!

» **నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ మృతితో ఖాళీ భర్తీ చేసేందుకు సన్నాహాలు**
» **ఎన్నికలపై నేతల దోబూచులాట**


ఓర్సు లక్ష్మి


పాములపాటి కృష్ణ

నందిగామ, జనవరి 19 : మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి ఆకస్మిక మృతితో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు మునిసిపల్ అధికారులు రంగంసిద్ధం చేస్తున్నారు. సాధారణంగా చైర్‌పర్సన్ మరణిస్తే వైస్ చైర్మన్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మునిసిపాలిటీలలో రెండు వైస్ చైర్మన్ పోస్టులు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఆ ఇద్దరిలో ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారన్న అంశంపై చర్చ సాగుతోంది. పాలకవర్గం ఏర్పడిన సమయంలో ఏడో వార్డు నుంచి మాడుగుల నాగరత్నం, 15వ వార్డు నుంచి ఓర్సు లక్ష్మిలను వైస్ చైర్‌పర్సన్‌లుగా ఎంపిక చేశారు. కొద్దికాలం క్రితం నాగరత్నం మృతి చెందడంతో 1వ వార్డు నుంచి గెలుపొందిన పాములపాటి కృష్ణను ఆ స్థానంలో భర్తీచేశారు. చైర్‌పర్సన్ వరలక్ష్మి మరణంతో వైస్ చైర్‌పర్సన్‌లుగా ఉన్న ఓర్సు లక్ష్మి, పాములపాటి కృష్ణలపైనే పట్టణంలో విస్తృత చర్చ సాగుతుంది. ఈ ఇద్దరిలో ఎవరిని నియమిస్తారన్న ఆసక్తి నెలకొంది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అధికార పార్టీకి ఈ ఎంపిక కత్తిమీద సాములాంటిదే అవుతుంది. ఓర్సు లక్ష్మి పట్టణంలో బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ కాగా, పాములపాటి కృష్ణ అదే స్థాయిలో బలమైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. పేరుకు ఆపద్ధర్మమే అయినప్పటికీ ఎక్కువ కాలం కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరణించిన వరలక్ష్మి, నాగరత్నంల వార్డులకు ఉపఎన్నికలు నిర్వహించిన తరువాతే చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహిస్తారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈలోగా ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. పైగా ఎన్నికల ముందు నియోజకవర్గానికి కీలకమైన నందిగామ పట్టణంలో ఉపఎన్నిక నిర్వహించే సాహసం అధికార పార్టీ చేయకపోవచ్చని ప్రజలు భావిస్తున్నారు. ఈ ఫలితం సాధారణ ఎన్నికలపై పడే అవకాశం ఉండటంతో ఉప ఎన్నికలకు తొందర పకడక పోవచ్చని భావిస్తున్నారు. దీంతో ఎక్కువ సమయం ఆపద్ధర్మ చైర్‌పర్సన్ కొనసాగే అవకాశం కనిపిస్తున్నది. నిర్ణయాధికారం మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులదే అయినప్పటికీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సూచనల మేరకే నియామకం జరుగుతుంది. దీంతో వారు ఎవరిని అందలం ఎక్కిస్తారో వేసి చూడాల్సిందే.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెడన, జనవరి 19 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొరిపర్తి నాగదుర్గాభవాని (36) శుక్రవారం ఉదయం భర్త నాగరాజుతో కలిసి బైక్‌పై మచిలీపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రిలో భర్తకు చికిత్స అనంతరం ఇరువురు బైక్‌పై దొడ్డిపట్ల గ్రామానికి బయలుదేరగా మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో పెడన-గుడివాడ రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో భవానీ బైక్‌పై నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందింది. భవానీ తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ టి.సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్పీడ్ బ్రేకర్ వద్ద సూచికలు లేకపోవడంతోతరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

అయోధ్య రామ అక్షితల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 19 : మల్లవల్లిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అయోధ్య శ్రీరాముని అక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య ఊరేగింపుగా బయలుదేరి ఇంటింటికీ అక్షితలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఎదురువాడ శ్రీనివాసరావు, ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు, సర్పంచ్ కట్టుబోయిన నాగమణి, సమరసత సభ్యులు అక్కినేని సత్యవాణి, భక్తి బృంద సభ్యులు పాల్గొన్నారు.

లేఅవుట్ లేనట్టే!

- లబ్ధిదారులకు పట్టాలతో సరి
- రెవెన్యూ అలసత్వంతో అడుగు ముందుకుపడని పేదల లేఅవుట్లు
- బాపులపాడు, కె.సీతారాంపురం, పెరికీడులో ఇళ్ల మంజూరు కోసం ఏడాదిగా ఎదురు చూపు
- జగన్ పాలనలో నెరవేరని సొంతింటి కల



బాపులపాడులో రెండో విడత పేదలకు కేటాయించిన స్థలాలు (ఫైల్)

హనుమాన్‌జంక్షన్, జనవరి 19: మండలంలో పేదల సొంతింటి కలనెరవేర్చడానికి ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాలు అక్కరకు రాకుండానే పోతాయన్న గుబులు పట్టుకుంది. పట్టాలు ఇచ్చిన అధికారులు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిలో వేసిన లేఅవుట్స్‌కు రెవెన్యూ అనుమతి ఇవ్వకపోవడతో గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని బాపులపాడు, కె.సీతారాంపురం, పెరికీడులో దాదాపు వెయ్యి మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టాలు పంపిణీ చేసి దాదాపు ఏడాది కావస్తుంది. కాని ఇంత వరకు కేటాయించిన భూమిలో వేసిన లేఅవుట్స్‌కు రెవెన్యూ అనుమతులు ఇవ్వలేదు. బాపులపాడులో రెండవ విడత 630 మందికి డంపింగ్ యార్డు సమీపంలో 20 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి, లేఅవుట్ సిద్ధం చేయకుండానే గతేడాది ఆరంభంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వంశీ పట్టాలు పంపిణీ చేశారు. గత నెలలో గ్రామ వైసీపీ నాయకులు కూడ పొజిషన్ చూపించే పేరుతో లబ్ధిదారులను లేఅవుట్‌కు రప్పించి ప్రభుత్వ ఘనతను చాటుకున్నారు. కె.సీతారాం పురంలో 200 మందికి, పెరికీడులో 160 మంది లబ్ధిదారులకు 10 ఎకరాలు భూమిని కేటాయించారు. ఆక్రమణదారులు ఆందోళన వ్యక్తం చేయగా వారికి కొంత భూమిని ముట్టచెప్పి మిగిలిన భూమిని స్వాధీనం చేసుకొని పేదల ఇళ్లస్థలాలకు కేటాయించారు. ఆ రెండు గ్రామాల లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి ఏడాది అవుతోంది. భూమిలో ప్లాట్లుకు రాళ్లు మాత్రమే వేశారు. ఇప్పటి వరకు ఈ గ్రామాల్లో వేసిన ఈ మూడు లేఅవుట్స్‌కు రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో గృహనిర్మాణ శాఖ లేఅవుట్‌ను అభివృద్ధి చేయని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ అప్రూవల్ ఇవ్వక పోవడంతో మండలంలోని ఈ మూడు లేఅవుట్లలో కనీసం రోడ్లు కూడ వేయలేదు. కేవలం సరిహద్దు రాళ్లు మాత్రమే పాతారు. లేవుట్‌కు అప్రూవల్ ఇస్తేగాని గృహనిర్మాణ శాఖ ఐడీ నెంబరు కేటాయించి లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా దాదాపు వెయ్యి మంది పట్టాలు పట్టుకొని గృహ నిర్మాణ శాఖ అధికారులు చుట్టు తిరుగుతున్నారు. ఇళ్ల నిర్మాణ మంజూరు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నారు.

అనుమతికి ఫైల్ సిద్ధం

మండలంలో పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిలో లేఅవుట్ తయారు చేసి పై అధికారుల అనుమతి కోసం ఫైల్ సిద్ధం చేస్తున్నామని బాపులపాడు తహసీల్దార్ సునీల్‌బాబు తెలిపారు. త్వరలోనే లేఅవుట్స్‌కు అప్రూవల్ చేయించి గృహ నిర్మాణ శాఖకు పంపించడం జరుగుతుందని తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

టీఎన్టీయూసీ బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరణలో యార్లగడ్డ వెంకట్రావు



బస్సుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులకు కష్టాలు పెరిగాయన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. లెబర్ వెల్ఫేర్ బోర్డులోని స్కీమ్‌లన్నీ అమలు జరగడం లేదన్నారు. ఇప్పటికి కార్మికులకు పనులు లేక 64మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. గతంలో వాహన అపరాధ రుసుం రూ. 130లు ఉండగా గ్రీన్ ట్యాక్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రూ.1030లకు పెంచిందన్నారు. రవాణా రంగాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని కార్మికుల జీవితాలల్లో చీకటి నింపిందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు చంద్రన్న కార్మిక చైతన్య యాత్ర జరుగుతుందన్నారు. టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బుస్సే నాగప్రసాద్ మాట్లాడుతూ, టెక్కలిలో ప్రారంభమైన బస్సుయాత్ర ఆదివారం ఉదయం గన్నవరం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని, 11 గంటలకు గన్నవరం చేరుకుంటుందని బస్సుయాత్రను విజయవంతం చేయాలన్నారు. నాయకులు కొండేటి శివయ్య, ఆళ్ల శ్రీనివాస్‌నాయుడు, ప్రొద్దుటూరు నరేంద్ర కుమార్, కోసూరి సురేష్, నర్రా లక్ష్మణరావు, జోసఫ్, బొర్రా మల్యాద్రి, సత్యనారాయణ, హేమచందర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరుతో దళితులకు గాలం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బోడె ప్రసాద్, తదితరులు

పెనమలూరు, జనవరి 19 : దళితుల అభ్యున్నతికి గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సుమారు 28 సంక్షేమ పథకాలను రద్దు చేసి వారికి తీవ్ర అన్యాయం చేసి, అంబేడ్కర్ విగ్రహం పేరుతో మరోసారి దళితులకు గాలం వేస్తున్న సైకో జగన్‌ను దళితులు నమ్మరని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోరంకి బీజేఆర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జగన్ దళితులను ఏవిధంగా మోసం చేస్తున్నదీ వినతిపత్రం రూపంలో ఆయనకు సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో సుమారు 188 మంది దళితులు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్కులు అడిగారని దళిత డాక్టర్‌ను, మాస్కు పెట్టుకోనందుకు కిరణ్ అనే యువకుడిని దారుణంగా కొట్టి చంపిన విషయం రాష్ట్ర ప్రజలకు ఇంకా గుర్తుందన్నారు. వైసీపీకి చెందిన ఒక ఎమ్మెల్సీ దళితుడైన తన కారు డ్రైవరును హత్య చేసి ఇంటికి పార్సిల్ పంపిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో వణుకూరు, ముదునూరు, కాటూరు, కలువపాముల తదితర గ్రామాల ఎస్సీ కాలనీల్లో వసతుల మెరుగుకు కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఐదేళ్ల కిందట తాను ముఖ్యమంత్రి కావడానికి సాయపడిన దళితుడు కోడికత్తి శ్రీనుకు బెయిల్ వచ్చేందుకు కనీసం సహకరించకపోవడం జగన్ నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, మారుపూడి ధన కోటేశ్వరరావు, పీతా గోపీచంద్, పులి విజయ్, మహేష్, వేమూరి ప్రసాద్, నందేటి సూర్య, వినుకొండ రాజా, ఇడుపులపాటి రవిచంద్ర, బంద్రపల్లి శ్రీకాంత్, జడ శ్రీను, పిల్లజెట్టి సీమోను, పరిమి ఏసోబు, నందిపాముల రాజశేఖర్, చిలుకూరి రాబర్ట్, మల్లాది రత్నగిరి, బంద్రపల్లి సుబ్బారావు, కొమరపల్లి సుగుణరావు, పరిమి విల్సన్, ఏసురత్నం పాల్గొన్నారు.

గాయపడ్డ వృద్ధుడి మృతి

హనుమాన్‌జంక్షన్, జనవరి 19 : స్థానిక నాలుగు రోడ్లు కూడలిలో ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాపులపాడు ఇందిరానగర్ కాలనీకి చెందిన వృద్ధుడు కంచనపల్లి వెంకట సత్యనారాయణ (72) విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడు సైకిల్‌పై గుడివాడ రోడ్డు నుంచి నూజివీడు రోడ్డు వైపు వెళుతుండగా ఏలూరు రోడ్డు వైపు నుంచి నూజివీడు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 19 : విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గుడివాడ ఏఈ (ఆపరేషన్), రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పెరికీడు, బాపులపాడు, కె.సీతారాంపురం, ఎస్.ఎన్.పాలెం, ముందడుగు, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

తెన్నేరు (కంకిపాడు), జనవరి 19 : అన్న ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలుగు రైతు మండల అధ్యక్షుడు నిమ్మగడ్డ నాగేశ్వరరావు అన్నారు. తెన్నేరులో శుక్రవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగువాడి ఆత్మగౌరవాన్ని దేశ నలుమూలలా వ్యాప్తి చేసిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తూవస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉద్దండి కుటుంబరావు, జుజ్జువరపు నాని, దాత పిన్నమనేని వెంకట్రావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో యూటీఎఫ్ నేతలు

ఉయ్యూరు, జనవరి 19 : అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఉయ్యూరు డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫెడరేషన్ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ప్రతి నెలా ఒకటిన జీతాలు, పీఆర్సీ, డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిల సాధనకై చేపట్టిన యూటీఎఫ్ పోరుబాటలో భాగంగా స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శనగా ప్రధాన సెంటర్‌కు చేరుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతినెలా ఒకటిన జీతం, మెరుగైన పీఆర్సీ, సకాలంలో డీఏలు, ఉద్యోగ, ఉపాధ్యా యులతో స్నేహపూరిత వాతావరణం అని 2019 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని విమర్శించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు నరేంద్ర, హబీబ్, ఉయ్యూరు మండల అధ్యక్షుడు పీవీ రమణ, పామర్రు, తోట్లవల్లూరు, పెనమలూరు మండల ప్రధాన కార్యదర్శులు ఎస్ అంకరవి, విజయశ్రీ, బీవీరావుతో పాటు కంకిపాడు, పమిడిముక్కల మండల శాఖల నాయకులు పాల్గొన్నారు.

బీసీల ప్రతినిధి సురేశ్‌బాబుకు సీటివ్వాలి

ఉయ్యూరు, జనవరి 19 : వెనుక బడిన వర్గాల ప్రతినిధిగా ఉన్న పడమటి సురేశ్ బాబుకు పెనమలూరు వైసీపీ సీటివ్వాలని బీసీ సాధికార సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు పామర్తి జయప్రకాశ్ డిమాండ్ చేశారు. ఉయ్యూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పెనమలూరు ఎమ్మెల్యేగా ఉన్న కేపీ సారథి పార్టీ మారుతున్న నేపథ్యంలో పెడన ఎమ్మెల్యే జోగి రమేశ్‌ను పెనమలూరు ఇన్‌చార్జిగా నియమించడం సరికాదన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి అండగా ఉంటూ స్వచ్ఛంద సంస్థ స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజా నాయకుడిగా పేరు గడించి పార్టీని బలోపేతం చేసిన సురేశ్ బాబును విస్మరించి జోగి రమేశ్‌ను అభ్యర్థిగా ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చేందుకు తాము ప్రయత్నం చేస్తే అందుకు సురేశ్‌బాబు సహకారం అందించి పరిష్కారానికి కృషి చేసిన ఆయనను కాదని వేరే వారికి టికెట్ కేటాయించడం సరైంది కాదని పార్టీ అధినాయకత్వం పునరాలోచించి సురేశ్ బాబును అభ్యర్థిగా ప్రకటించక పోతే బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్యచరణ రూపొందించి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాల రద్దు దుర్మార్గం



గన్నవరంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు, కంకిపాడులో టీడీపీ అన్నదానం

గన్నవరం, జనవరి 19 : అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు రద్దు చేయటం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బేత శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న ధర్నాలో భాగంగా శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీల పట్ల సానుకూల దృక్పథంతో సమస్యలు పరిష్కరించాల్సింది పోయి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలన్నారు. నాయకులు వెంకటేశ్వరరావు, కుమారి, లక్ష్మీ, రమ, సాంబ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన అధికారంలోకి వస్తాయని, అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, దండమూడి చౌదరి వంటి యువ నాయకులు అన్న క్యాంటీన్లను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు చలవాది రాజా, వణుకూరు విక్రం, అన్నవరపు శివపార్వతి, గుడిశేవ నాంచారయ్య, కోడెల సురేష్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

సమాజాన్ని జాగృతం చేసిన వేమన : జేసీ



మచిలీపట్నం, జనవరి19 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని జాగృతం చేసిన ప్రజాకవి యోగి వేమన అని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. జయంతిని పురస్కరించుకుని వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏ కాలానికైనా వేమన పద్యం పరిష్కారంగా ఉంటుం దన్నారు. డీఆర్వో పి.రోజా, కలెక్టరేట్ ఏవో రాధిక, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

● అంబేడ్కర్ విగ్రహాలకు అంగన్వాడీల వినతిపత్రం



అవనిగడ్డలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినదిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, గుడివాడలో ఎస్మాను నిరసిస్తూ ధర్నా

అవనిగడ్డ, జనవరి 19 : రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా సీఎం జగన్మోహనరెడ్డి వ్యవహరించడాన్ని నిరసిస్తూ అంగన్వాడీలు శుక్రవారం అవనిగడ్డలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. డిమాండ్లలో పది పరిష్కరించామని రాష్ట్ర మంత్రులు అబద్ధాలు ప్రచారం చేసుకోవటం సిగ్గు చేటని అంగన్వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మలా జ్యోతి అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించి సీతాయిలంకలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ సంఘ నేతలు ఏ.నాగమణి, సువర్ణ, సుశీల, అవనిగడ్డ ప్రాజెక్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : డిమాం డ్లు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగుతుందని అంగన్వాడీలు స్పష్టం చేశారు. సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఎస్మా చట్టం ప్రయోగించటం దారుణమని విమర్శించారు.

పామర్రు : అంగన్వాడీల సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ ప్రధా న కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కైలే రత్నశ్రీ, బొమ్మారెడ్డి పద్మ, వాణి, గంగాధరరావు, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరుతున్నా

● పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్

అవనిగడ్డ, జనవరి 19 : ఈనెల 25వ తేదీలోగా జనసేన పార్టీలో చేరనున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల తాను హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌ను కలిసి రాజకీయాల గురించి చర్చించానన్నారు. దాదాపు 30 సంవత్సరాలకుపైగా ఇన్‌ఫ్రా, కనస్ట్రక్షన్, డిస్ట్రిబ్యూషన్ రంగాలను విజయవంతంగా నడిపిన విక్కుర్తి శ్రీనివాస్ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, శాఖాధిపతులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. శ్రీనివాస్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావటం పట్ల జనసేన కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదు



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

అవనిగడ్డ, జనవరి 19 : దళితులను నిరంతరం హింసలకు గురి చేస్తూ వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను పక్కదారి పట్టిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు దుయ్యబట్టారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించటాన్ని ఖండిస్తూ టీడీపీ నేతలు అవనిగడ్డలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కోడి కత్తి కేసులో ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్న శ్రీను మరింత కాలం జైలులో మగ్గేలా చూడటమేనా ముఖ్యమంత్రి దళితులకు చేస్తున్న న్యాయమని ఆయన ప్రశ్నించారు. యాసం చిట్టిబాబు, నడకుదుటి జనార్ధనరావు, మత్తి శ్రీనివాసరావు, దిరిశం బాలకోటయ్య, మాచవరపు ఆదినారాయణ, మేడికొండ విజయ్, బర్మా శ్రీను, గుంటూరు వినయ్, మండలి రామ్మోహనరావు, బచ్చు రఘునాథ్, ఘంటసాల రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు : అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అపహాస్యం పాలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసే అర్హత లేదని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్లకుమార్ రాజా ధ్వజమెత్తారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్లగా బడుగులను అన్నివిధాల వంచన చేసిన ముఖ్యమంత్రి ఎన్నికల సమీపిస్తున్న సమయంలో దళితుల ఆరాధ్యుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ,స్మృతివనం పేరుతో హడావిడిచేస్తున్నా రన్నారు. జగన్ పాలనలో ఎస్సీఎస్టీలు విద్య, ఉద్యోగాలు తీవ్రంగా నష్టపోవడం నిజంకాదా? అని ప్రశ్నించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వల్లూరిపల్లి గణేష్, మండపాక శంకర్‌బాబు, మైనేని ఇందిర, కోత్తూరు శ్రీనివాసరావు, సుబ్రమణ్యం వం పుగడవల ఫ్రాన్సిస్, చాట్ల పున్నమ్మ, మంతెన రామాంజనేయులు, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌తో బాలశౌరి భేటీ

● టీడీపీ, జనసేన నేతల హర్షం



కోడూరులో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ, జనసేన నేతలు

కోడూరు, జనవరి 19 : మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన సందర్భంగా టీడీపీ, జనసేన నేతలు కోడూరు ప్రధాన సెంటర్‌లో పెద్ద ఎత్తున టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. మాజీ జట్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణ, నాగం రఘు, తోట లక్ష్మణ రావు, బండే రాఘవ, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు



అవనిగడ్డలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి : యూటీఎఫ్

మచిలీపట్నం టౌన్, జనవరి 19 : ఒకటో తేదీనే జీతాలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం కోనేరుసెంటర్‌లో నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఏ. ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లెనిన్‌బాబు, జిల్లా కార్యదర్శి సిహెచ్. రాజాశ్రీధర్, మచిలీపట్నం నగర శాఖ అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రరావు, మచిలీపట్నం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. శ్రీనివాసరావు, ఆర్. వెంకటేశ్వరరావు, పెడన మండల అధ్యక్ష, కార్యదర్శులు పాపయ్య, రంగనాథ్, గూడూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. వెంకటేశ్వరరావు, కె.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు యూటీఎఫ్ కార్యాలయం నుంచి కోనేరుసెంటర్ వరకు నాయకులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. **అవనిగడ్డ** : ప్రతి నెలా ఒకటో తేదీనే జీతా లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అవనిగడ్డలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూటీఎఫ్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ మీదుగా వంతెన సెంటర్ వరకు ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పరిరక్షణ అందరి బాధ్యత



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

మచిలీపట్నం టౌన్ : జీవిత బీమా రంగాన్ని ప్రైవేటీకరణ చర్యలను ఎల్ఐసీ ఉద్యోగులతో పాటు పాలసీదారులు కూడా ఖండించాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్‌కుమార్ అన్నారు. జీవిత బీమా జాతీయకరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి మచిలీపట్నం ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి, ఎల్ఐసీని పరిరక్షించుకుందాం అంటూ నినాదాలు చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలి



అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా తీసుకున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని కోరుతూ అవనిగడ్డ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్, ఉపాధ్యక్షుడు రాయపూడి వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి తిమ్మన సుబ్బారావు, సీనియర్ న్యాయవాదులు మత్తి వెంకటేశ్వరరావు, పరుచూరి రాఘవేంద్రరావు, అందె శ్రీరామకృష్ణమూర్తి, ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ



మచిలీపట్నం టౌన్ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు బాబూరాజేంద్రప్రసాద్, జిల్లా సంఘ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఏ. శ్రీహరి, బి. శ్రీహరి, జయకర్‌బాబు, కె. వెంకటేశ్వరరావు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాల కోసమే భూహక్కు చట్టం : టీడీపీ ధ్వజం



మచిలీపట్నం టౌన్ : భూకబ్జాల కోసమే వైసీపీ ప్రభుత్వం భూహక్కు చట్టం తీసుకు వచ్చిందని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల ప్రసాద్ ధ్వజమెత్తారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదులు భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ ఉద్యమిస్తోంటే వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. వైసీపీ తీసుకుని వచ్చిన భూహక్కు చట్టం వల్ల కలిగే నష్టాన్ని చంద్రబాబు గ్రహించారని, అందుకే గుడివాడ సభలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టాన్ని రద్దు చేస్తానని వాగ్దానం చేసారన్నారు.

11 ఎకరాల చెరకు తోట దగ్ధం

తోట్లవల్లూరు : యాకమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన 11 ఎకరాల చెరకు తోటలు దగ్ధమై రూ .1.80 లక్షల నష్టం వాటిల్లింది. గాదె భగవాన్‌రెడ్డికి చెందిన 11 ఎకరాలు, బండి రాజ్యలక్ష్మికి చెందిన రెండు ఎకరాల చెరకుతోట దగ్ధమయ్యాయని, విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వైరుతెగిపడి ప్రమాదం సంభవించినందని అగ్నిమాపక అధికారి రవితేజ తెలిపారు. రైతులు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతును ఆదుకోవాలి

పెదపారుపూడి : తుఫాన్ ధాటికి నష్టపోయిన రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి విమర్శించారు. వెంట్రప్రగడ టీడీపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పైసా కూడా ఇవ్వకపోవటం శోచనీయమన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండల కార్యదర్శి మసిముక్కు రాంబాబు, గొరిపర్తి రవికుమార్, చిలక ఆంజనేయులు, దానబోయిన వెంకట నారాయణ, చలసాని చక్రపాణి, దూళ్ల జమ్మిబాబు, గోగం రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు వెంకటరత్నమ్మ కన్నుమూత



తోట్లవల్లూరు : తోట్లవల్లూరుకు చెందిన శతాధిక శుక్రవారం మాకినేని వెంకటరత్నమ్మ (103) శుక్రవారం కన్నుమూశారు. మృతి చెందారు. అనారోగ్యానికి గురికాకుండా వెంకటరత్నమ్మ జీవించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు ఒక కొడుకు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పమిడిముక్కల : పమిడిముక్కల, కృష్ణాపురం సబ్‌స్టేషన్‌ల మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ మచిలీపట్నం ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్ ఎం.భాస్కరరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

మొవ్వ జడ్పీ విద్యార్థిని సంజన ప్రతిభ



కూచిపూడి : మొవ్వ జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జొన్నలగడ్డ నాగ సంజన జిల్లా స్థాయి కబడ్డీ టీమ్‌కు ఎంపికైనట్లు పీడీ రామారావు తెలిపారు. నంద్యాలలో జరిగే పోటీల్లో సంజన పాల్గొంటుందని తెలిపారు. సంజనను హెచ్ ఎం సాంబశివరావు, పీడీ రామారావు, మనోహరి అభినందించారు.

వనమలమ్మ జాతర ప్రారంభం

మచిలీపట్నం టౌన్ : నిజాంపేటలో విజయ వనమలమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. విన్నకోట వన ప్రభాకర్, శైలజ, మిరి యాల రామకృష్ణ, అమ్మాజీ, శేషశయన్, ధనలక్ష్మి, డిప్యూటీ మేయర్ భారతి, బాబ్జీ దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగన్ పాలన : ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ : సీఎం జగన్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. విజయవాడలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వెళుతున్న బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అగ్రహారంలో కులగణన ప్రారంభం

చల్లపల్లి : కుల గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో చిన్నరాట్నాలు కోరారు. చల్లపల్లి అగ్రహారంలో కుల గణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ (నాని), నాగ సీతారామారావు (ఫణి), మాధవేంద్రరావు, కలతోటి సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.